క్లుప్తంగా

చిల్లబండలో శ్రీసుంకులమ్మ దేవర

కోడుమూరు రూరల్: మండలంలోని చిల్లబండ గ్రామంలో వెలసిన శ్రీసుంకులమ్మ దేవర ఉత్సవాలను బుధవారం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. గ్రామస్తులు అమ్మవారికి నైవేద్యాలను సమర్పించి తమ మొక్కుబడులను చెల్లించుకున్నారు. దేవర సందర్భంగా చిల్లబండలో వెలసిన శ్రీసుంకులమ్మకు కుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, గ్రామసర్పంచు మధుసూదన్‌రెడ్డి, చంద్రశేఖరరెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సంత్ సేవాలాల్‌కు ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న సుగాలిమెట్ట గ్రామస్తులు

పాణ్యం: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్‌సేవాలాల్ మహరాజ్ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల పరిధిలోని సుగాలిమెట్ట వద్ద ఉన్న సంత్ సేవాలాల్ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఇతర పూజా కార్యక్రమాలు చేపట్టారు. గిరిజనులు అధికం సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో సోమశేఖర్‌నాయక్, చంద్రానాయక్, రాముడు, తిరుపాల్ నాయక్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ చేయించుకోవాలి



ఈ-కేవైసీని పరిశీలిస్తున్న ఏఓ

ఓర్వకల్లు: రబీ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను స్థానిక రైతు భరోసా కేంద్రాలలో నమోదు చేసుకున్న రైతులు ఈ నెల 20వ తేదీ లోగా ఈ-కేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సుధాకర్ తెలిపారు. బుధవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో నిర్వహించిన ఈ-కేవైసీ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. రబీ సీజన్‌లో మండలంలో ఇప్పటి వరకు సుమారు 12,180 ఎకరాలలో పంట నమోదు చేయడం జరిగిందన్నారు. ఇందులో 80 శాతం మంది రైతులు ఈ-కేవైసీ పూర్తి చేసుకున్నారని, మిగిలిన 20 శాతం మంది రైతులు ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలన్నారు. ఈ-కేవైసీ చేయించుకున్న రైతులు తమ శనగ దిగుబడులను కనీస మద్దతు ధరకు అమ్ముకునే అవకాశం ఉంటుందన్నారు.

ఇంటర్ విద్యార్థులకు ఎథిక్స్-హ్యూమన్ వాల్యూస్ పరీక్ష

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లోని మోడల్ జూనియర్ కళాశాలలో జూనియర్ ఇంటర్ విద్యార్థులకు ఎథిక్స్- హ్యూమన్ వాల్యూస్ పరీక్ష నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వంశీమోహన్ తెలిపారు. కాగా ఎంపీసీ 13, బైపీసీ 31, సీఈసీ 37 మంది విద్యార్థులతో మొత్తం 81 మంది పరీక్షలకు హాజరయ్యారన్నారు. అదేవిధంగా స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జూనియర్ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు జరిగిన ఎథిక్స్ - హ్యూమన్ వాల్యూస్ పరీక్షకు వంద శాతం హాజరు అయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ బలరాముడు తెలిపారు. ఎంపీసీ విద్యార్థులు 38 మంది, బైపీసీలో 37 మందితో మొత్తం 75 మంది పరీక్షలు రాశారన్నారు.

శనగల విక్రయానికి రిజిస్ట్రేషన్ చేసుకోండి



అనుగొండ ఆర్‌బీకేలో శనగల రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న ఏఓ రవిప్రకాష్


కోడుమూరు రూరల్: పప్పు శనగను ప్రభుత్వం క్వింటాల్ రూ.5340ల ప్రకారం కొనుగోలు చేస్తుందని, రైతులంతా ఆయా రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని వెంకటగిరి, ఎర్రదొడ్డి, అనుగొండ రైతుభరోసా కేంద్రాలను తనిఖీ చేసి రికార్డులను, శనగ రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. శనగ సాగు చేసిన రైతులంతా మార్కెట్‌లో ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుని నష్టపోకుండా ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధరకు తమ దిగుబడులను విక్రయించుకోవాలని సూచించారు.

ఆర్‌బీకే పనుల పరిశీలన

కల్లూరు: మండల పరిధిలోని బస్తిపాడు గ్రామంలో నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కొరకు ప్రభుత్వం ఆయా గ్రామాల్లోనే ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి వారికి అవసరమైన ఎరువులను, మందులను అందుబాటులో ఉంచిందన్నారు. కార్యక్రమంలో వీపీఏ అంకాలమ్మ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు.. చూద్దాం రారండి

- బుగ్గరామేశ్వరస్వామి ఆలయం ముస్తాబు
- శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్న ఆలయ అధికారులు
- రేపటి నుంచి ప్రారంభం కానున్న మహాశివరాత్రి ఉత్సవాలు



గర్భగుడి చుట్టూ క్యూలైన్‌లో చలువ పందిళ్లు ఏర్పాటు చేసిన దృశ్యం



విద్యుత్ దీపాలతో అలంకరణలో కాల్వబుగ్గ ఆలయ ప్రధాన రాజగోపురం

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు బుగ్గరామేశ్వరస్వామి ఆలయం ముస్తాబు అవుతోంది. ఈమేరకు అధికారులు ఏర్పాట్లను శరవేగంగా చేపడుతున్నారు. భ్రమరాంబ, బుగ్గరామేశ్వరస్వాముల వారి ఉత్సవాలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. అందుకు తగ్గట్టుగా తాగునీరు, విద్యుత్, వాహనాల పార్కింగ్, క్యూలైన్లు, చలువ పందిళ్లు, సాంస్కృతిక కార్యక్రమాల వేదిక నిర్మాణం తదితర ఏర్పాట్లు చేస్తున్నారు. అందులో భాగంగా విద్యుత్ శాఖ అధికారులు ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి ప్రక్కనే మరో స్థలంలోకి మార్పు చేశారు. ప్రతి ఏడాది ప్రధాన విద్యుత్ తీగల నుంచి తాత్కాలికంగా విద్యుత్‌ను సరఫరా చేసేవారు. అయితే ఈ ఏడాది అలాకాకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేయాలనే యోచనతో శాశ్వత విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. అలాగే ఆలయ ముఖద్వారంలో ఉన్న రాజగోపురాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

సాంస్కృతిక కార్యక్రమాలకు శాశ్వత వేదిక : స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏ విధమైన తొక్కిసలాట జరుగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వేసవి ఎండల దృష్టిలో పెట్టుకొని గర్భగుడి చుట్టు చలువ పందిళ్లు వేశారు. భక్తులు స్నానం చేయడానికి స్త్రీ, పురుషులకు వేర్వేరు స్నానపు ఘట్టాలను ఏర్పాటు చేశారు. ముఖ్యంగా మహిళా భక్తుల భద్రతా విషయంలో అటు ఆలయ అధికారులు, ఇటు పోలీసు శాఖ వారు ప్రత్యేక దృష్టి సారించారు. ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్ పర్యవేక్షణలో ప్రతి రోజు 90 వేల లీటర్ల నీటిని సరఫరా చేసేందుకు ఆలయ ప్రాంగణంలో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకును శుభ్రం చేయించారు. గతంలో సాంస్కృతిక కార్యక్రమాలు పాత వేదికపై నిర్వహించేవారు. దీంతో ప్రజలు తీవ్రఅసౌకర్యాలు ఎదుర్కోవాల్సివచ్చేది. అలా కాకుండా ఈ ఏడాది టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా ఉన్న ఖాళీ మైదానంలో శాశ్వత వేదికను నిర్మిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం, ఉచిత ఆరోగ్య శిబిరం, మొబైల్ మరుగుదొడ్లు, క్రీడా మైదానం, ఎద్దుల బండలాగుడు ప్రదేశంలో కోర్టు, స్నానపు గదులను శుభ్రం చేయడం వంటి పనులను రెండు రోజుల్లో పూర్తి చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు ఈఓ పేర్కొన్నారు.

భూ హక్కు పత్రాలను అందిస్తాం

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండల పరిధిలోని 21 రెవెన్యూ గ్రామాల్లో భూముల రీ సర్వే పూర్తయ్యాక రైతులకు జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలను అందజేస్తామని కర్నూలు రూరల్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివరాముడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు భూములను రీ సర్వే చేసి రైతులకు భూ హక్కు పత్రాలను పంపిణీ చేసేందుకు ఆధునిక డిజిటల్ రికార్డులను సిద్ధం చేస్తున్నామన్నారు. బుధవారానికి మండలలోని గ్రామాల్లో 62195.46 ఎకరాల్లో రీ సర్వే పూర్తయిందన్నారు. రీ సర్వే చేసిన తర్వాత జారీ చేసిన రికార్డులను ట్యాంపరింగ్ చేయడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఈ సర్వేలో వీఆర్‌ఓలు, గ్రామ సర్వే సహాయకులు, వీఆర్‌ఏలు, రైతులు పాల్గొన్నారు.

19న రగ్బీ పోటీలు

కర్నూలు (టౌన్): ఈ నెల 19న ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం రాయవరంలో రాష్ట్రస్థాయి రగ్బీ మినీ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.రామాంజనేయులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి 13 జిల్లాలకు చెందిన అనుబంధ రగ్బీ అసోసియేషన్ జట్లు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. పాల్గొనే క్రీడాకారులు 2011, 2012, 2013 సంవత్సరాల్లో జన్మించిన వారు మాత్రమే అర్హులని తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడండి



భోగేశ్వరాలయంలో శివరాత్రి ఏర్పాట్లను పరిశీలించి మాట్లాడుతున్న డీఎస్పీ మహేశ్వరరెడ్డి

గడివేముల: మహాశివరాత్రిని పురస్కరించుకొని భోగేశ్వరాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని నంద్యాల డీఎస్పీ మహేశ్వరరెడ్డి అన్నారు. బుధవారం గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన శ్రీదుర్గా భోగేశ్వరాలయంలో శివరాత్రి ఏర్పాట్లను డీఎస్పీ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తుల వాహనాలను ఆలయానికి కొద్ది దూరంలోనే పార్కింగ్ చేసుకునేలా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జాగరణకు అధికంగా భక్తులు వస్తారని, అందుకు అనుగుణంగా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చైర్మన్ సునీల్‌కుమార్‌రెడ్డి, ఈఓ చంద్రశేఖరరెడ్డిలకు సూచించారు. ఆలయ ప్రాంగణమంతా లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ప్రాంగణాలు సీసీ కెమెరాల అధీనంలో ఉంటాయన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం స్వామి వారికి దర్శించుకుని పూజలు చేశారు. డీఎస్పీ వెంట పాణ్యం సీఐ వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య, ధర్మకర్తలు సురేంద్రనాథ్‌రెడ్డి, పరమేశ్వర రెడ్డి, ఆలయ ప్రధానార్చకులు శ్యాంసుందర్‌శర్మ, ఆలయసిబ్బంది రమణ, తదితరులు ఉన్నారు.

పాడి పరిశ్రమకు ప్రభుత్వ ప్రోత్సాహం



ప్రదర్శనలో మొదటి బహుమతి సాధించిన లేగ దూడ యజమానికి బహుమతి అందిస్తున్న దృశ్యం

గడివేముల: రాష్ట్ర ప్రభుత్వం పాడిపరిశ్రమ అభివృద్ధికి ఎంతో ప్రోత్సాహం అందిస్తున్నట్లు నంద్యాల పశుగణాభివృద్ధి సంస్థ ఉపసంచాలకులు డాక్టర్ రాజశేఖర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని పెసరవాయి గ్రామంలో పశువైద్యశాఖ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రదర్శనలో దాదాపు 30 లేగ దూడలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా మేలు జాతి లేగ దూడలు గ్రామీణ ప్రాంతాలలో అధికంగా ఉన్నాయన్నారు. వాటిని బయటికి తీసేందుకే ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రదర్శన కార్యక్రమంలో మంచిగా ఉన్న లేగ దూడల రైతులకు బహుమతులను, అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ సంచాలకులు డాక్టర్ కమలాకర్, పెసరవాయి పశువైద్యాధికారి డాక్టర్ షేక్ బాబా ఫక్రుద్దీన్, డాక్టర్ రాజశేఖరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పాఠకుల సంఖ్యను పెంచాలి



గ్రంథాలయాన్ని తనిఖీ చేస్తున్న రాష్ట్ర డైరెక్టర్ ప్రసన్నకుమార్

ఓర్వకల్లు: గ్రంథాలయాలకు వచ్చే పాఠకుల సంఖ్యను పెంచాలని రాష్ట్ర పౌర గ్రంథాలయ సంచాలకులు ఎంఆర్ ప్రసన్న కుమార్ అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన నన్నూరు శాఖ గ్రంథాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రసన్న కుమార్ మాట్లాడుతూ.. గ్రంథాలయాల సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, గ్రామ పంచాయతీ నుంచి గ్రంథాలయ పన్నును వసూలు చేయాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రంథాలయానికి కేటాయించిన స్థలాన్ని పరిశీలించి, వీలైనంత త్వరలో భవన నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేస్తామని చెప్పారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాటం ప్రకాష్, స్థానిక గ్రంథాలయాధికారి వెంకటకృష్ణారెడ్డి, కార్యాలయ సిబ్బంది మక్బుల్ బాషా ఉన్నారు.

అందరికీ ఉపాధి అవకాశాలు కల్పించాలి



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం గ్రామంలో భూములు కోల్పోయిన ప్రతి ఒక్కరికి ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఎం రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పాణ్యంలోని మార్కెట్‌యార్డులో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిన్నాపురం రైతులకు పరిహారం విషయంలో పూర్తి స్థాయిలో న్యాయం చేయాలన్నారు. గ్రామంలో ఉపాధి లేని వారికి కంపెనీలో ఉపాధి కల్పించాలన్నారు. అంతేకాక ఇంకా భూ సమస్యలను పెండింగ్‌లో ఉంచారని, వాటిని పరిష్కరించాలన్నారు. అనంతరం పలు పార్టీల నాయకులు తమ అభిప్రాయాలు తెలియజేశారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా కార్యదర్శి రమేష్ కుమార్, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు రాజశేఖర్, రామచంద్రుడు, భాస్కర్, లాయర్‌బాబు, ప్రతాప్, శ్రీనివాసరావు, దత్తు తదితరులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి



మాట్లాడుతున్న గద్దల సామేల్

పాణ్యం: నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర నాయకుడు గద్దల సామేల్ డిమాండ్ చేశారు. బుధవారం పాణ్యంలో ఆయన విలేకరుల మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో రాజ్యాంగ నిర్మాతకు రక్షణ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. విగ్రహానికి చుట్టూ సీసీ కెమెరాలు ఉన్నప్పటికి అధికారులు వాటిని పరిశీలించకపోవడం దారుణమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ బాబు, ఈశ్వరయ్య, రామాంజినేయులు, బాషా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అన్నదానం

గూడూరు రూరల్: మండల పరిధిలోని కె.నాగలాపురం గ్రామ దేవత శ్రీ సుంకులాపరమేశ్వరీదేవి దేవస్థానం ఆధ్వర్యంలో శివస్వాములు, పాదయాత్రికులకు చేపట్టిన అన్నదాన కార్యక్రమం బుధవారంతో ముగిసిట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి దినేష్ తెలిపారు. గత వారం రోజులుగా మహాశివరాత్రిని పురస్కరించుకుని కె.నాగలాపురం మీదుగా శ్రీశైలానికి తరలివెళ్తున్న శివస్వాములు, భక్తులకు స్థానిక శివాలయంలో ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన గ్రామ పెద్దలు, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



కె.నాగలాపురంలో భోజనం చేస్తున్న పాదయాత్రికులు

21న అంతర్ రాష్ట్ర బండ లాగుడు పోటీలు

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ దేవస్థానంలో ఈ నెల 21న అంతర్ రాష్ట్ర స్థాయి ఎద్దుల బండ లాగు పోటీలు నిర్వహిస్తున్నట్లు దేవస్థాన ట్రస్టుబోర్డు చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న పోటీలను స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగే పోటీలలో గెలుపొందిన ఎద్దుల యజమానులకు మొదటి 8 స్థానాలకు గాను వరుసగా రూ.1,00,000లు, రూ.80 వేలు, రూ.60 వేలు, రూ.40వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున నగదు బహుమతులను ప్రదానం చేస్తామని తెలిపారు. ఆసక్తి గల ఎద్దుల యజమానులు అదే రోజు ఉదయం 8.30 గంటలలోగా రూ.500లు ప్రవేశ రుసుం చెల్లించి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 79810 16808, 9640 643253 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.

పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలి



పారిశుద్ధ్య కూలీలతో మాట్లాడుతున్న అధికారులు

సి.బెళగల్: గ్రామ పంచాయతీలలో పనిచేసే క్లాప్ మిత్రలు (పారిశుద్ధ్య కూలీలు) గ్రామ పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ రాముడు, ఈఓఆర్డీ సందీప్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సి.బెళగల్ గ్రామానికి చెందిన పారిశుద్ధ్య కూలీలతో బుధవారం అధికారులు మాట్లాడారు. కొంతమంది గ్రామాలలో పరిశుభ్రత కార్యక్రమాల నిర్వహణపై నిర్లక్ష్యం చేస్తూ ప్రైవేట్‌గా పనులు చేసుకుంటున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ, అధికారుల ఆదేశాల మేరకు మాత్రమే పనులు చేయాలన్నారు. ప్రజలఆరోగ్య పరిరక్షణకు పల్లెలను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు.

19న రామలింగేశ్వరస్వామి రథోత్సవం

గూడూరు రూరల్: మండల పరిధిలోని గుడిపాడులో ఈ నెల 19న శ్రీ రామలింగేశ్వరస్వామి రథోత్సవం నిర్వహించనున్నట్లు బుధవారం ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 18న మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కోలాటాలు, నందికోలు సేవ, చెక్క భజనలు, రామలింగేశ్వరస్వామి ప్రభ, కల్యాణ మహోత్సవ కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. 19న రథ హోమము, శ్రీరామ కోటి పూజ, అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, భక్తులు తరలివచ్చి ఉత్సవాలను జయప్రదం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

మద్యం కేసులో మట్కా బీటర్లు అరెస్టు

కర్నూలు: కర్నూలు నగరం బుధవారపేట నుంచి ఉస్మానియా కాలేజీకి వెళ్లే దారిలోని హంద్రీ బ్రిడ్జి వద్ద అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో మూడవ పట్టణ పోలీసులు దాడి చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. బుధవారపేటకు చెందిన ధరూర్ ప్రసాద్, ధరూర్ సందీప్‌కుమార్, మురళీకృష్ణ కొన్నేళ్లుగా మట్కా బీటర్లుగా పనిచేస్తూ పోలీసు రికార్డులకెక్కారు. బుధవారం మధ్యాహ్నం హంద్రీ బ్రిడ్జి వద్ద తెలంగాణ మద్యం విక్రయాలు జరుపుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి పది తెలంగాణ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు మూడవ పట్టణ పోలీసులు తెలిపారు.

ఉపాధి పనుల్లో కూలీల సంఖ్య పెంచాలి



నందనపల్లె చెక్‌డ్యాంలో పూడికతీత పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

కర్నూలు (న్యూటౌన్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల సంఖ్య పెంచాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి ఏపీఓ మహమ్మద్ బాషాను ఆదేశించారు. బుధవారం కర్నూలు మండలం నందనపల్లె గ్రామంలో చెక్‌డ్యాంలో పూడిక తీత పనులను పీడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కూలీలతో ఆయన మాట్లాడారు. గత ఏడు వారాల పెండింగ్ వేతనాలు కూలీల ఖాతాలో జమ అయ్యాయన్నారు. కూలీలకు దినసరి వేతనం రూ.257 పడేలా పని కల్పించాలని అధికారులకు సూచించారు. అనంతరం ఉపాధి హామీ పథకంలో భాగంగా రైతు ఎల్లప్ప సాగు చేసిన నిమ్మతోటను పరిశీలించారు. సేంద్రియ ఎరువులు వినియోగించి పంటలు పండించాలని సూచించారు. ఉపాధి పథకంలో మునగ పంటను సాగుచేస్తే లాభాలు పొందవచ్చని అన్నారు. కేజీ మునగ సుమారు రూ.150 నుంచి రూ.200 వరకు మార్కెట్‌లో ధర ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధి పథకం ఏపీఓ మహమ్మద్ బాషా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామిరెడ్డి తాత మహోత్సవం



శ్రీఅవధూత రామిరెడ్డి తాతకు పూజలు నిర్వహిస్తున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కోడుమూరు: కోడుమూరు మండలం అనుగొండ గ్రామంలో వెలసిన శ్రీఅవధూత రామిరెడ్డి తాత తిరుణాల మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి రామిరెడ్డి తాతను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు తాత సేవాసంస్థాన్ సభ్యులు రామచంద్రారెడ్డి, గ్రామస్తులు, స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు కోట్ల హర్షకు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు కృష్ణారెడ్డి, చనుగొండ్ల సత్యారెడ్డి, రాజారెడ్డి, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు బండలాగుడు పోటీలు: రామిరెడ్డి తాత తిరుణాల మహోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం అనుగొండ గ్రామంలో పాల పండ్ల ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు తాత సేవాసంస్థాన్ రామచంద్రరెడ్డి తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వృషభాల యజమానులకు మొదటి బహుమతిగా రూ.30,016లు, 2వ బహుమతిగా రూ.22,016లు, 3వ బహుమతిగా రూ.17,016లు, 4వ బహుమతిగా రూ.12,016లు, 5వ బహుమతిగా రూ.9,016లు, 6వ బహుమతిగా రూ.6,016లను దాతల సహకారంతో అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పంట నమోదు చేయించుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న డీడీఏ వెంకటేశ్వర్లు

గూడూరు రూరల్: ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ సహాయక సంచాలకులు (డీడీ) వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని మల్లాపురంలో బుధవారం ఆయన పంట నమోదుపై తనిఖీ నిర్వహించారు. రైతులు ఖరీఫ్, రబీ సీజన్లలో సాగు చేసిన పంటల వివరాలను ఆర్‌బీకేల్లో నమోదు చేసుకోవాలన్నారు. పంట నమోదు వల్ల ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు దెబ్బతింటే పంట నష్ట పరిహారం మంజూరు అవుతుందన్నారు. ఆయన వెంట జేడీఏ బాలవర్ధన్‌రాజు, ఏఓ శ్రీవర్ధన్‌రెడ్డి, ఏఈఓ లక్ష్మీనారాయణ, రైతులు ఉన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి



స్టడీ అవర్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

కల్లూరు: పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈఓ శ్రీనివాసులు సూచించారు. బుధవారం కల్లూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న స్టడీ అవర్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలంటే భయం వీడలన్నారు. అనవసరంగా మానసికంగా ఆలోచన చేయకుండా ప్రశాంతంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు హుస్సేన్, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మిస్తేనే మేలు

కర్నూలు(అర్బన్): కృష్ణా నదిపై సోమశిల నుంచి సిద్దేశ్వరం సంగమేశ్వరం వరకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న బ్రిడ్జి (తీగల వంతెన) వద్దని, బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మిస్తే రెండు రాష్ట్రాలకు మేలు జరుగుతుందని రాయలసీమ జేఏసీ నేతలు చెప్పారు. బుధవారం జేఏసీ కో ఆర్డినేటర్ వేణుగోపాల్‌రెడ్డి, సభ్యులు డా.పారా శ్రీధర్‌రెడ్డి, గడ్డం అమర్నాథ్‌రెడ్డి జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిని కలిసి బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మాణానికి మద్దతు లేఖను తీసుకున్నారు. ఈ సందర్భంగా వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ బ్రిడ్జి కం బ్యారేజీ నిర్మాణానికి రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి ప్రతిపాదనలు రాలేదని కేంద్ర మంత్రులు చెబుతున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లేందుకు వీలుగా రాయలసీమలోని ఎనిమిది మంది ఎంపీలు, 52 మంది ఎమ్మెల్యేల మద్దతు కోరుతున్నామన్నారు. అందులో భాగంగానే ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు అందించి వారి నుంచి అధికారిక లేఖలు తీసుకుంటున్నామన్నారు.

17 నుంచి మహా శివరాత్రి ఉత్సవాలు

కర్నూలు కల్చరల్: కర్నూలు నగర శివారులోని జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రూపాల సంగమేశ్వర స్వామి జగన్నాథ గట్టు అభివృద్ధి సమితి అధ్యక్షులు ప్యాలకుర్తి నరసింహారెడ్డి, ఆలయ ఈవో వై.గుర్రెడ్డి పేర్కొన్నారు. బుధవారం శాలమ్మ సత్రంలోని ఆలయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లా విడిపోయిన తరువాత జిల్లాలో ఉన్న ప్రముఖ శైవాలయం ఇదే అన్నారు. ఈ ఆలయంలో ఈ నెల 17 నుంచి శివరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 18 న పూజలు, దిన్నెదేవరపాడు గ్రామస్తులచే ప్రభోత్సవం, రాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకం, భక్తులు జాగరణ చేసేందుకు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు, 19న శివపార్వతుల కల్యాణం, పల్లకీ సేవ, రథోత్సవం జరుగుతుందన్నారు. సమితి జాయింట్ సెక్రటరీలు కె.క్రిష్టన్న, మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ ఆలయం చేరుకోడానికి ఏపీఎస్ ఆర్టీసీ వారు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారన్నారు. సమావేశంలో సమితి సభ్యులు వాసుదేవయ్య, తదితరులు పాల్గొన్నారు.